సాక్షి ఆదిలాబాద్

శనివారం ; 29 ; ఏప్రిల్ ; 2023



నవోదయ పిలుస్తోంది..!

నవోదయలో ప్రవేశానికి శనివారం నిర్వహించనున్న పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,920 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. IIలో▸

నేడు హైకోర్టు జడ్జిల రాక

ఆదిలాబాద్‌టౌన్: సమరస్త దివస్ సందర్భంగా న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించనున్న అంబేడ్కర్ జయంతి వేడుకలకు హైకోర్టు జడ్జిలు సుధీర్‌కుమార్, ఎంజీ ప్రియదర్శినిలు హాజరు కానున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రమోహన్, చంద్రకాంత్ చౌదరి ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పంచవటి హోటల్‌లో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /23.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షంతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కానిస్టేబుల్ రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 30న నిర్వహించనున్న కానిస్టేబుల్ తుది రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో 12 కేంద్రాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. మొత్తం 4,820 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సెంటర్‌లోకి 8.45 గంటల నుంచే అభ్యర్థులను అనుమతించనున్నట్లు తెలిపారు. 10 గంటల తర్వాత గేటు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు. పరీక్ష సమయంలో ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. బయోమెట్రిక్ హాజరు నమోదు నేపథ్యంలో అభ్యర్థులు మెహందీ, ట్యాటులను వేసుకోవద్దని సూచించారు.

3 నుంచి జిల్లా కోర్టుకు సెలవులు

ఆదిలాబాద్‌టౌన్: మే 3 నుంచి జిల్లా కోర్టుకు సెలవులు ప్రకటిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే తొలివిడత మే 1నుంచి 16 వరకు ఒకరు, రెండో విడత మే 17 నుంచి 31 వరకు అత్యవసర కేసుల విచారణకు మరో జడ్జి అందుబాటులో ఉంటారు. మొదటి విడత జిల్లా జడ్జి, రెండో విడత ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ జడ్జి అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

జిల్లా జైలును సందర్శించిన డీఐజీ



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా జైలును జైళ్ల శాఖ వరంగల్ డీఐజీ శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. జైలులో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సేంద్రియ పద్ధతిలో సాగవుతున్న కూరగాయలు, కంట్రీ పౌల్ట్రీ ఫామ్‌ను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వసతులపై ఆరాతీశారు. కేసుల పురోగతి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు జైలు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సమావేశంలో జైలు సూపరింటెండెంట్ అశోక్, జైలర్లు సూర్యప్రకాశ్‌రెడ్డి, మధు, డిప్యూటీ జైలర్ ప్రకాశ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్

ఆదిలాబాద్‌టౌన్: మాతా శిశు మరణాలు తగ్గించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. ఇటీవల మెడికల్ ఆఫీసర్లుగా నియమితులైన వారితో జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న వార్షిక సంవత్సరంలో ఒక్క మాతా శిశు మరణం సంభవించకుండా చూడాలని సూచించారు. గర్భిణులు మృతిచెందితే సంబంధిత వైద్యాధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించా రు. సమావేశంలో ప్రోగ్రాం అధి కారులు విజ య సారథి, వైసీ శ్రీనివాస్, రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ కౌస్తుబా తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఎం గ్రామాల్లో అంతర్గత పరిశీలన చేపట్టాలి

కైలాస్‌నగర్: స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమం కింద గుర్తించిన గ్రామ పంచాయతీల్లో అంతర్గత పరిశీలన నిర్వహించాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వచ్ఛ భారత్ మిషన్‌పై ఎంపీడీవోలు, ఎంపీవోలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో గుర్తించిన జీపీలను బహిరంగ మలవిసర్జన రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఇంటింటా మరుగుదొడ్డి నిర్మించుకోవడంతో పాటు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం ఆయా బృందాలు గ్రామాల్లోకి వెళ్లి పరిశీలన చేసి నివేదికలు సమర్పించాలన్నారు. అంతకు ముందు ఓడీఎఫ్ నివేదికపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ శ్రీజ, జెడ్పీసీఈవో గణపతి, డీఆర్డీవో కిషన్,డీపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

హోర్డింగ్.. గోల్‌మాల్!

- యాడ్స్ డబ్బుల స్వాహాపర్వం
- మున్సిపల్ ఆదాయానికి గండి
- టెండర్ ద్వారా అప్పగించినవి కొన్నే
- అనధికారికంగా అనేకం
- యాడ్ ఏజెన్సీల పేరిట సబ్ లీజ్ దందా..
- ఆ డబ్బులు పరుల జేబులోకి



ఆదిలాబాద్ పట్టణంలోని హోర్డింగ్‌లు

సాక్షి,ఆదిలాబాద్: ఆదిలాబాద్ మున్సిపాలిటీలో హోర్డింగ్ గోల్‌మాల్ యథేచ్ఛగా సాగుతుంది. వీటిపైన ప్రదర్శించే యాడ్స్‌ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరాల్సి ఉండగా, అక్రమంగా పరుల జేబుల్లోకి వెళ్తుండడం గమనార్హం. టెండర్ ద్వారా యాడ్ ఏజెన్సీలకు అప్పగించినవి కొన్నే ఉండగా, అనధికారికంగా కొనసాగుతున్నవి అనేకం. రెండేళ్లుగా కొంత మంది ఇలా బల్దియా ఆదాయానికి గండి కొడుతున్నా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇదీ తతంగం..

ఆదిలాబాద్ బల్దియా పరిధిలోకి వచ్చే ప్రధాన రహదారిలో దస్నాపూర్ నుంచి తిర్పెల్లి వరకు, అలాగే పట్టణంలోని ముఖ్య కూడళ్లలోని డివైడర్లలో రెండేళ్ల క్రితం భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. ఇలా పట్టణంలో 26 హోర్డింగ్‌లు ఉన్నాయి. మొదట్లో ప్రారంభించిన తర్వాత ఆఫ్‌లైన్‌లో వీటి నిర్వహణ కొనసాగించారు. ఇక్కడే అవినీతికి బీజం పడింది. అసలు ఎన్ని హోర్డింగ్‌లు టెండర్ ద్వారా ఏజెన్సీలకు ఇచ్చారు.. వాటి ద్వారా మున్సిపాలిటీకి ఎంత ఆదాయం వస్తుందనేది స్పష్టంగా ఉండాలి. అయితే వీటి నిర్వహణకు సంబంధించి పట్టణ ప్రణాళిక అధికారి వద్ద పూర్తి వివరాలు అందుబాటులో ఉండాలి. అయితే ఈ లావాదేవీల వ్యవహారాలపై టీపీవోకు స్పష్టత లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరే ఈ విభాగం నిర్వహణను క్రమబద్ధంగా చేపట్టాల్సి ఉండగా, ఇష్టారీతిన ఎవరికి వారే హోర్డింగ్‌లను తమ సొంత ఆస్తులుగా భావించి యాడ్స్ ఇవ్వడం, వాటి ద్వారా వచ్చే డబ్బులను తమ జేబులో వేసుకోవడం బల్దియాలో పరిపాటిగా మారిందని ఆరోపణలున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగంతో పాటు పూర్తి స్థాయిలో అన్ని విభాగాలను పర్యవేక్షించాల్సిన కమిషనర్ కూడా చేతులెత్తేశారనే అపవాదు వ్యక్తమవుతుంది.

ఆఫ్‌లైన్ దోపిడీ..

హోర్డింగ్‌ల నిర్వహణ మొత్తం ఆన్‌లైన్‌లో సాగుతుందని చెబుతున్న పట్టణ ప్రణాళిక విభాగం అసలు వీటి ద్వారా ఆదాయమే రావడం లేదనే కోణంలో చెప్పడం ద్వారా ఈ అక్రమ వ్యవహారానికి వంతు పాడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 26 హోర్డింగ్‌లలో 8 వీక్ష ఏజెన్సీకి, 2 కనక దుర్గా, 4 ఎస్ఆర్, 6 వాసవి, 6 లక్ష్మి యాడ్ ఏజెన్సీలకు ఇచ్చామని మున్సిపాలిటీలో చెబుతునానరు. ఎవరైన యాడ్ ప్రదర్శన కోసం ఆయా ఏజెన్సీలకు ఫోన్ చేస్తే అవి మరొకరికి ఇవ్వడం జరిగిందని, తమ చేతిలో లేవని చెబుతున్నారని కొంతమంది పేర్కొంటున్నారు. తద్వారా హోర్డింగ్‌ల సబ్ లీజ్ దందా ఒక వ్యాపారంగా సాగుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జరగాల్సింది ఇలా..

కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) నుంచి ఈ హోర్డింగ్‌లకు సంబంధించి ఏజెన్సీలకు ఆన్‌లైన్‌లో అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. పట్టణంలో 26 హోర్డింగ్‌లు ఉండగా, ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో కేవలం 8 మాత్రమే సీడీఎంఏ నుంచి అనుమతి ఉంది. మిగతా 18 అనధికారికంగా కొంతమంది బడాబాబులు అక్రమ నిర్వహణ చేపట్టి యాడ్స్ ప్రదర్శించడం ద్వారా ఆ డబ్బులను తమ జేబులో వేసుకుంటున్నారు. ఒక్కరోజు యాడ్‌కే పది వేలకు పైగా వసూలు చేస్తుండగా, పట్టణంలోని పలు హోర్డింగ్‌లపై ఓ పాఠశాలకు సంబంధించి రోజుల తరబడి యాడ్ ప్రదర్శిస్తుండడం గమనార్హం. దానికి సంబంధించి అసలు డబ్బులు చెల్లిస్తున్నారా.. లేదా అనేదానిపై ఎవరి వద్ద స్పష్టత లేదు. సీడీఎంఏకు ఒక్క హోర్డింగ్‌కు ఏడాదికి రూ.69,120 చెల్లించాలి. తద్వారా ఆ ఏజెన్సీకి సీడీఎంఏ యాడ్స్ ప్రదర్శించేందుకు అనుమతి ఇస్తుంది. అయితే అక్రమంగా అనేక హోర్డింగ్‌లకు సంబంధించి ఎలాంటి డబ్బులు మున్సిపాలిటీకి చెల్లించకుండా ఇలా అనధికారికంగా వీటి నిర్వహణ కాని చ్చేస్తున్నారు.

కొత్తగా టెండర్ చేయాలి

పట్టణంలో హోర్డింగ్‌లకు సంబంధించి ప్రస్తుతం ఉన్న విధానాన్ని పూర్తిగా రద్దు చేసి కొత్త టెండర్ చేయాలి. అన్ని హోర్డింగ్‌లను అధికారికంగా ఏజెన్సీలకు అప్పగించాలి. వీటిపై యాడ్స్ ప్రదర్శనకు సంబంధించి ధరలను అదుపులో ఉంచేవిధంగా ఏజెన్సీలకు నిబంధనలు రూపొందించాలి.

– అంబకంటి అశోక్, కాంగ్రెస్ కౌన్సిలర్

ఆన్‌లైన్ చేస్తున్నాం..

పట్టణంలోని హోర్డింగ్‌లకు సంబంధించి నిర్వహణ మొత్తం ఆన్‌లైన్‌లో సీడీఎంఏ నుంచి జరుగుతుంది. అన్ని హోర్డింగ్‌లను ఆన్‌లైన్ చేసేందుకు గతేడాదిగా ప్రక్రియ మొదలుపెట్టాం. దాన్ని పూర్తి చేస్తాం. – సాయికిరణ్, టీపీఓ, ఆదిలాబాద్ మున్సిపాలిటీ

ప్రచారం పేరిట దోచుకుంటున్నారు..

కైలాస్‌నగర్: హోర్డింగ్‌ల పేరిట దళారులు దోచుకుంటుంటే మున్సిపల్ అధికారులు ఏం చేస్తున్నారని కాంగ్రెస్, టీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన కౌన్సిలర్లు ప్రశ్నించారు. చైర్మన్ ప్రేమేందర్ అధ్యక్షతన ఆదిలాబాద్ మున్సిపల్ అత్యవసర సర్వసభ్య సమావేశం కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. తొలుత పారిశుద్ధ్య కార్మికులు, లైన్‌మెన్, బిల్‌కలెక్టర్ల వేతనాల చెల్లింపునకు సంబంధించిన తీర్మానాన్ని ప్రవేశపెట్టగా మెజారిటీ సభ్యులు ఆమోదించారు. అనంతరం కౌన్సిలర్లు అలాల్ అజయ్,అంబకంటి అశోక్ మాట్లాడుతూ పట్టణంలోని పాత జాతీయ రహదారి,ప్రధానచౌక్‌ల్లో గల హోర్డింగ్‌ల్లో ఎన్నింటికి అనుమతులు ఉ న్నాయని కమిషనర్‌ను ప్రశ్నించారు. టీపీవో సాయికిరణ్ మాట్లాడుతూ మొత్తం 27 హోర్డింగ్‌లు ఉండగా 8మాత్రమే ఆన్‌లైన్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో ఆగ్రహించిన సదరు కౌన్సిలర్లు హోర్డింగ్‌లను నిర్వహిస్తున్న దళారులు మున్సిపల్‌కు డబ్బులు చెల్లించకుండా అక్రమంగా ఎలా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్కో హోర్డింగ్‌కు రూ.7వేలు, రూ.12వేలు, రూ.14వేలు ఇలా ఇష్టారాజ్యాంగా వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. సమాధానం చెప్పేలోపే అధికారపార్టీ కౌన్సిలర్లు బయటకు వెళ్లిపోవడంతో సమావేశం అర్ధంతరంగా ముగిసింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శైలజ,వైస్‌చైర్మన్ రంజానీ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమ్మెబాట



కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో నినాదాలు చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

- విధులు బహిష్కరించి కలెక్టరేట్ ఎదుట నిరసన
- స్తంభించిన పంచాయతీ పాలన
- నిలిచిన 'ఆసరా' పంపిణీ
- పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై ప్రభావం

జిల్లాలోని పంచాయతీలు:	468
జూనియర్ పంచాయతీ కార్యదర్శులు :	287
ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు	36
రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు :	145

కైలాస్‌నగర్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించడంతో పాటు నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌ను సర్వీస్‌గా పరిగణించాలని డిమాండ్ చేస్తూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్‌లు) సమ్మెబాట పట్టారు. జిల్లా వ్యాప్తంగా కార్యదర్శులు శుక్రవారం విధులు బహిష్కరించి కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అదనపు కలెక్టర్ రిజ్వాన్ జేపీఎస్‌ల సంఘం నాయకులతో చర్చలు జరిపారు. సమ్మె విరమించాలని కోరగా వారు అంగీకరించకుండా ఆందోళనకు దిగారు. దీంతో ఆయా గ్రామాల్లో పంచాయతీ పాలన పూర్తిగా స్తంభించింది. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలు పర్యవేక్షణ నిలిచిపోయింది. వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జనన, మరణాల ధ్రువీకరణ పత్రాలు, ఇంటి అనుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రధానంగా వేలిముద్రలు పడని వృద్ధులకు ఆసరా పింఛన్లు కార్యదర్శులే ఇవ్వాల్సి ఉండగా రెండు రోజుల క్రితమే ప్రారంభమైన ఈ పంపిణీకి ఆటంకం ఏర్పడింది.

సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్‌ల మద్దతు

జేపీఎస్‌ల సమ్మెకు కాంగ్రెస్, బీజేపీ, సీపీఎంలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.మల్లేశ్ సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం స్పందించేదాకా సమ్మె

ప్రభుత్వం ఆదేశించే ప్రతీ పనిని బాధ్యతాయుతంగా నిర్వర్తించాం. ఏ శాఖలో లేని విధంగా ప్రభుత్వం నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్‌ను ప్రకటించి తమతో వెట్టిచాకిరీ చేయించుకుంది. అయినా నిరాశ చెందకుండా గ్రామాలను అభివృద్ధి పథంలో నిలిపేందుకు నిరంతరం శ్రమిస్తున్నాం. ఇప్పటికైనా మా సేవలను ప్రభుత్వం గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలి. క్రమబద్ధీకరిస్తూ జీవో జారీ చేసేంతవరకు సమ్మెను కొనసాగిస్తాం.

– కె. చంద్రశేఖర్, జేపీఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

- అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న రిజ్వాన్ బాషా షేక్

కైలాస్‌నగర్: మాజీ సైనికుల సంక్షేమానికి తగు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా సైనిక్ బోర్డు సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 768 మంది మాజీ సైనికుల కుటుంబాలకు గుర్తింపు కార్డులు అందించామన్నారు. స్వయం ఉపాధి కోసం జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాల కల్పనకు ఉపాధి కల్పన శాఖ ద్వారా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఇంటి స్థలాలు, వ్యవసాయ భూముల మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను ప్రభుత్వానికి నివేదించామన్నారు. సైనిక కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని చెప్పారు. సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు, జిల్లా ఇన్‌చార్జి సైనిక సంక్షేమాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు, లీడ్ బ్యాంకు మేనేజర్ భాస్కర్, సంఘం నాయకులు, జిల్లాలోని మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన నిరీక్షణ

- సహకార ఉద్యోగులకు కనీస వేతనం
- జిల్లాలో 84 మందికి ప్రయోజనం



సర్వీస్ పుస్తకాన్ని అందజేస్తున్న డీసీవో శ్రీనివాస్‌రావు

కైలాస్‌నగర్: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగుల నిరీక్షణ ఎట్టకేలకు ఫలించింది. వారికి హెచ్‌ఆర్ పాలసీ అమలుతో పాటు వేతన స్థిరీకరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 17న జీవో నం.44 జారీ చేసిన విషయం తెలిసిందే. తదనుగుణంగా జిల్లా సహకార శాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. హెచ్‌ఆర్ పాలసీ అమలుకు 31.03.2019వ తేదీని కటాఫ్‌గా పరిగణించారు. దీంతో జిల్లాలోని 23 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న 84 మంది ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలుతో పాటు శాలరీ ఫిక్సేషన్ చేపట్టారు. ఉద్యోగుల క్యాడర్, వారి సర్వీస్ ఆధారంగా అమలు చేసిన అధికారులు ఆ వివరాలను సర్వీస్ పుస్తకంలో పొందుపర్చారు. శుక్రవారం జిల్లా సహకారశాఖ అధికారి ఎస్.శ్రీనివాస్‌రావు, జిల్లా ఆడిట్ అధికారి బిక్కుతో కలిసి పలువురు ఉద్యోగులకు సర్వీస్ పుస్తకాలు అందజేశారు. నలుగురు ఉద్యోగులపై కేసులు నమోదై ఉండటంతో వారి వివరాలు రాష్ట్ర కమిటీకి పంపినట్లు డీసీవో తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో కార్యదర్శి స్థాయి ఉద్యోగులు 22మంది, స్టాఫ్ అసిస్టెంట్లు 45మంది, ఆఫీస్ సబార్డినేట్లు 17 మంది ప్రయోజనం పొందనున్నారు. ఇన్నాళ్లు అరకొర వేతనాలు పొందిన వీరు ఇక నుంచి ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ట్రెజరీ నుంచి శాలరీ పొందనున్నారు. హెచ్‌ఆర్ పాలసీ అమలుపై సదరు ఉద్యోగులతో పాటు వారి కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



క్రీడా సామగ్రి అందజేస్తున్న అదనపు కలెక్టర్

కైలాస్‌నగర్: మే 1నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కోరారు. ఈమేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిబిరాల నిర్వాహకులకు జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి క్రీడా శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, తైక్వాండో, వాలీబాల్, సాఫ్ట్‌బాల్ వంటి క్రీడలపై నెల పాటు శిబిరాలు కొనసాగనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 16, పట్టణ ప్రాంతంలో ఐదు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి శాఖ అధికారి వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ శ్రీనివాస్ రావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.గోవర్ధన్ రెడ్డి, ఐటీడీఏ ఉమ్మడి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

చేరువగా పౌరసేవలు

- డీలర్లకు సీఎస్‌సీ నిర్వహణ బాధ్యతలు
- జిల్లాలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం
- త్వరలోనే అందుబాటులోకి..



డీలర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న సీఎస్‌సీ సిబ్బంది (ఫైల్)

జిల్లాలోని రేషన్‌షాపులు, కార్డుల వివరాలు

మండలాలు:	18
రేషన్‌షాపులు:	356
రేషన్‌కార్డులు:	1,91,894
ఎఫ్ఎస్‌సీ కార్డులు:	1,77,474
ఏఎఫ్ఎస్‌సీ కార్డులు:	14,170
ఏఏపీ కార్డులు:	250

కైలాస్‌నగర్: కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ) ద్వారా అందించే పౌర సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కమీషన్‌పై ఆధారపడి పనిచేస్తున్న రేషన్‌డీలర్లకు వీటి నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సంకల్పించింది. తద్వారా డీలర్ల ఆదాయం పెంచడంతో పాటు స్థానికంగా ప్రజలకు అవసరమైన సేవలను సత్వరం అందించాలని భావిస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఇప్పటికే సీఎస్‌సీల నిర్వహణపై డీలర్లకు అవగాహన కల్పించారు. ఇందుకు అవసరమైన ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సైతం ప్రారంభించారు. ఇప్పటికే ఆరు మండలాల్లో డీలర్ల వివరాల నమోదు పూర్తి కాగా ఈ నెలాఖరులోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేదిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. వచ్చే నెల మొదటి వారం నుంచి డీలర్ల ద్వారా సీఎస్‌సీ సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

డీలర్లకు ఆర్థిక తోడ్పాటునందించేలా

రేషన్‌కార్డుదారులకు ప్రతి నెలా బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్లు ప్రభుత్వం నుంచి కమీషన్ పొందుతున్నారు. అయితే ఈ కమీషన్ తమకు సరిపోవడం లేదని, దాన్ని పెంచాలని లేకుంటే కనీస వేతనాలు చెల్లించాలంటూ డీలర్లు పలుమార్లు ఆందోళనలు చేపట్టారు. అలాంటి వారికి ఆర్థిక తోడ్పాటుతో పాటు ప్రజలకు స్థానికంగానే సీఎస్‌సీ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం డీలర్ల వివరాలు సేకరిస్తున్నారు. మూడు మండలాలకు కలిపి ఒక చోట రిజిస్ట్రేషన్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆదిలాబాద్ రూరల్, అర్బన్, మావల, తాంసి, భీంపూర్, తలమడుగు, నార్నూర్, ఉట్నూర్ మండలా ల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించిన సీఎస్‌సీ సిబ్బంది ఆయా మండలాల్లోని డీలర్ల వివరాలు సేకరించారు. వీటిని కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు పంపిస్తున్నారు. అక్కడి నుంచి డీలర్లకు యూజర్ ఐడీ, పాస్‌వర్డు కేటాయించనున్నారు. అవి వచ్చాక వారికి బయోమెట్రిక్ పరికరం, ఆధార్ ఎనేబుల్డ్ పేమేంట్ సిస్టమ్ (ఏఈపీఎస్) అందించనున్నారు.

56 రకాల సేవలు

కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, ఇన్సూరెన్స్, నేషనల్ పెన్షన్ స్కీం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన , ఉజ్వల గ్యాస్ కనెక్షన్ ఇలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు సంబంధించిన 56 రకాల సేవలను అందించనున్నారు. వీటితో పాటు బ్యాంకులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు సైతం నిర్వహించనున్నారు. మొబైల్, డీటీహెచ్ రిచార్జీలను సైతం చేపట్టనున్నారు. డీలర్లకు సంబంధించిన ఆర్‌వో పేమేంట్లను సైతం వీటి ద్వారా నిర్వహించుకోవచ్చు. సేవలు అందుబాటులోకి వచ్చినట్‌లైతే ప్రజలకు వ్యయ, ప్రయాసలు తప్పడంతో పాటు డీలర్లకు అదనపు ఆదాయం సమకూరుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



సీఎస్‌సీ సెంటర్ల నిర్వహణ రేషన్ డీలర్లకు మంచి అవకాశం. వీటి ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందించడంతో పాటు వారికి ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుంది. ఈ అవకాశాన్ని డీలర్లంతా సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెలాఖరు వరకు రేషన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తాం. ఐడీ, పాస్‌వర్డులు అందాక శిక్షణ ఇచ్చి మే మొదటి వారం నుంచి ఈ కేంద్రాల ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

– టీ కిరణ్‌కుమార్, డీఎస్‌వో

రిజిస్ట్రేషన్ చేస్తున్నాం



సీఎస్‌సీ బాధ్యతలు నిర్వహించేందుకు వీలుగా రేషన్ డీలర్ల వివరాలు నమోదు చేస్తున్నాం. ప్రతి మూడు మండలాలకు కలిపి ఈ ప్రక్రియ చేపడుతున్నాం. త్వరలోనే పూర్తికానుంది. కేంద్రం నుంచి యూజర్ ఐడీ, పాస్‌వర్డులు వారికి కేటాయించనున్నారు.

– కామెరి రాహుల్, సీఎస్‌సీ జిల్లా మేనేజర్

క్లుప్తంగా

కులదేవతలకు పూజలు



ఇంద్రవెల్లి: మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో వైశాఖ(బావై) మాసాన్ని పురస్కరించుకుని కుల దేవతలకు పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండలంలోని వాల్గోండ గ్రామంలో కినక వంశీయులు జంగుబాయి దేవత, మడావి వంశీయులు భీమల్ దేవుడికి పూజలు చేశారు. రాత్రి మహాపూజ నిర్వహించారు. ఇందులో జంగుబాయి దేవత పూజారి కినక శంభు, భీమల్ దేవుడి పూజరి మడావి శ్యామ్‌రావ్‌లతో పాటు గ్రామ పటేల్ కినక లచ్చు, సర్పంచ్ కినక జుగాదిరావ్ ఉన్నారు.

రేపు ఇంటర్, డిగ్రీ గురుకుల ప్రవేశ పరీక్ష

ఆదిలాబాద్‌టౌన్: మహాత్మా జ్యోతిబాపూలే ఆర్‌జేసీ, ఆర్డీసీ సెట్ ఈనెల 30న నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ గోపిచంద్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఇంటర్, డిగ్రీ ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకున్నవారు పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ఎన్‌సీసీ ఆఫీసర్లుగా పదోన్నతి



బ్యాడ్జితో సత్కరిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని 32 ఎన్‌సీసీ బెటాలియన్ కార్యాలయంలో శుక్రవారం ఎన్‌సీసీ అధికారులుగా పదోన్నతి పొందిన వారికి బ్యాడ్జిలతో సత్కరించారు. పలు పాఠశాలల్లో ఎన్‌సీసీ అధికారులుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వికాస్ సుబేదార్ మేజర్ సతీష్‌కుమార్ చేతుల మీదుగా బ్యాడ్జిలు ధరించారు. ఎండీ అన్వర్ అలీ, సాయినాథ్‌లకు అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్లుగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

నీటి కుంటలో పడి బాలుడి మృతి



కార్తీక్ మృతదేహం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ గ్రామ సమీపంలోని నీటికుంటలో పడి కార్తీక్ (9) శుక్రవారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుషన్ ఆశన్న–స్వప్న దంపతుల కుమారుడు కార్తీక్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. గ్రామ శివారు ప్రాంతంలో మొరం కోసం తవ్విన కుంటలో వర్షపు నీరు నిల్వ ఉంది. కార్తీక్ స్నేహితులతో కలిసి బహిర్భూమికి వెళ్లాడు. ఆకస్మాత్తుగా జారి నీటి కుంటలో పడి మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు బాలుడిని బయటకు తీశారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 99596 17233, 88858704769. [M-1190681]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 16K–18K ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640258899 [H-793421]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

- మామిడిపండు తి(కొ)నేముందు అప్రమత్తత అవసరం
- కాల్షియం కార్బైడ్‌తో మగ్గుతున్న పండ్లు
- ఆరోగ్యంపై ప్రభావముంటుందంటున్న నిపుణులు

మధురఫలం... విషతుల్యం



రసాయనాలతో పక్వానికి వచ్చిన మామిడిపండ్లు

పండ్లను కృత్రిమంగా పక్వానికి తెచ్చే రసాయనం ఇదే..

నిర్మల్‌ఖిల్లా: మామిడి పండ్ల సీజన్ మొదలైంది. వేసవిలో వీటికి ఎక్కువగా డిమాండ్. మార్కెట్ రోడ్లపై ఎక్కడ చూసినా అనేక రకాల జాతుల మామిడి పండ్లు నోరూరిస్తుంటాయి. పండ్లలో రారాజుగా పేరొందిన మామిడి విషతుల్యంగా మారుతోంది. గతంలో పండ్లను సహజంగా పండించి మార్కెట్‌కు తరలించేవారు. ఆరోగ్యంగా ఉండేందుకు సీజనల్ పండ్లు తినేందుకు జనం ఆసక్తి చూపించేవారు. మార్కెట్లోకి వచ్చే కాయలను కృత్రిమంగా మాగబెడుతున్నారు. నిషేధిత కాల్షియం కార్బైడ్, ఇతర ప్రమాదకర రసాయనాలను వ్యాపారులు విరివిగా వినియోగిస్తున్నారు. వీటి వినియోగంతో ప్రజారోగ్యంపై ప్రభావముంటోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కృత్రిమంగా పండుతున్న మామిడి...

జిల్లాకు వస్తున్న మామిడి పండ్లలో ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల చుట్టుపక్కల మామిడి తోటల నుంచి వచ్చేవే. వ్యాపారులు గుత్తగా మామిడి కాయలను తీసుకొచ్చి నిషేధిత కార్బైడ్ రసాయనాలను వాడుతూ పండ్లను మాగబెడుతున్నారు. కార్బైడ్ ఇతర రసాయనాలతో మాగబెట్టిన పండ్లు తినడంతో అనేక రోగాల బారిన పడే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అల్సర్, కాలేయం, క్యాన్సర్, గొంతునొప్పి, రక్త హీనత, కిడ్నీ, నరాల వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంటున్నారు. కార్బైడ్ వంటి రసాయనాలతో పండించిన మామిడి అనారోగ్యానికి కారణమవుతుండడంతో గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు వాటిని నిషేధించింది.

వాడాల్సింది ఇథిలిన్ వాయువు...

కాల్షియం కార్బైడ్ రసాయనం వినియోగించడాన్ని 2012 మార్చిలోనే అప్పటి ప్రభుత్వం హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధించింది. ఆహార కల్తీ నిరోధక శాఖలు దృష్టి సారించకపోవడంతో నిషేధిత కాల్షియం కార్బైడ్ సరఫరా సాగుతోంది. కాల్షియం కార్బైడ్‌కు బదులు ఇథలిన్ వాయువు ద్వారా పండ్లను మాగబెడితే ఆరోగ్యకరమని కేంద్ర ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. మాగబెట్టే గదులను ఉపయోగించాలని తెలిపింది. ఇందుకు రైపనింగ్ చాంబర్‌ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తోంది. ఇథలిన్ వాడకం, రైపనింగ్ చాంబర్‌ల ఏర్పాటుపై అధికారులు అవగాహన కల్పించడం లేదు.

మాగబెట్టిన పండ్లను గుర్తించండిలా...

మామిడికాయలను కార్బైడ్ ద్వారా మాగబెట్టి, రంగు మార్చి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. అయితే కార్బైడ్‌తో మాగబెట్టిన మామిడి పండ్లపై ఆకుపచ్చని మచ్చలు ఉంటాయి. పసుపు వర్ణం ఎక్కువగా ఉంటుంది. ఈ పండు తినే సమయంలో నోట్లో కొంచెం మంట ఉంటుంది. కడుపులో నొప్పి, గొంతు నొప్పి, డయేరియా ఉంటే కార్బైడ్ వాడినట్లుగా గుర్తించవచ్చు. సహజసిద్ధంగా మాగితే ఆకుపచ్చ, పసుపుపచ్చ రంగులు కలిసినట్టుగా ఉంటాయి. పండును కోసినప్పుడు గుజ్జు ఎరుపు, పసుపు కలిసినట్టుగా ఉంటుంది.

జిల్లాలో తగ్గిన దిగుబడి...

నిర్మల్ జిల్లావ్యాప్తంగా ఇటీవల కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షాలకు మామిడి పండిస్తున్న రైతులు నష్టానికి గురయ్యారు. ఉద్యానవనశాఖ అంచనా ప్రకారం జిల్లాలో 2,744 ఎకరాలలో మామిడిపంటను రైతులు సాగు చేశారు. ఇందులో అకాల వర్షాలకు 671 ఎకరాల్లో తోటలు దెబ్బతిన్నాయి. దీంతో 486 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు.దీంతో ప్రతిఏటా రావాల్సిన దిగుబడి ఈసారి తగ్గిపోయింది. వ్యాపారులు ఇతర ప్రాంతాల నుండి మామిడి దిగుమతి చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

ఆరోగ్యానికి హానికరం



రసాయనాలతో పక్వానికి తెచ్చిన పండ్లుతింటే అనేక ఆరోగ్య సమస్యల బారినపడే ప్రమాదముంది. దీర్ఘకాలికంగా ఇలాంటి పండ్లు తీసుకోవడం ద్వారా జీర్ణ సంబంధిత వ్యాధులు, కాళ్లుచేతులు తిమ్మిర్లు, నరాల బలహీన తలకు గురయ్యే అవకాశముంది. చిన్నారుల్లో వ్యాధి నిరోధకత తగ్గి శ్వాససంబంధిత ఇబ్బందులు తలెత్తుతాయి. గర్భిణుల్లో హార్మోన్లు దారితప్పుతాయి.

– డాక్టర్ బి.రవి, జనరల్ ఫిజిషియన్,నిర్మల్

కొనేటప్పుడే గుర్తించాలి..

కార్బైడ్, ఇతర రసాయనాలను ఉపయోగించిన మామిడి పండ్లు బయటికి లేత పసుపు, లోపల లేత తెలుపు రంగులో ఉంటాయి. సహజంగా పండిన పండు బయట లోపల ఒకేరంగులో ఉంటుంది. రంగును చూసి పండ్లను చాలావరకు గుర్తించే అవకాశముంది. రసాయనాల వినియోగంతో సహజంగా లభించే పోషకాలు కోల్పోతాయి. ఆరోగ్యపరంగా కూడా మంచివి కావు.

– రాథోడ్ శ్యాం నాయక్, నిర్మల్ జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

మంగ్లీ గ్రామాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్

- తాత్కాలిక రోడ్డు వేయించాలని కోరిన గ్రామస్తులు
- ఆరోగ్య పరిస్థితిపై ఆరా



గ్రామస్తులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ శ్రీజ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని వాన్‌వాట్ గ్రామ పంచాయతీ పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన మంగ్లీ గ్రామాన్ని ట్రైనీ కలెక్టర్ పి.శ్రీజ కాలినడకన వెళ్లి శుక్రవారం సందర్శించారు. గ్రామానికి గతంలో గవర్నర్ అసిస్టెంట్ నిధుల నుంచి రూ.10లక్షలతో ఎస్టీ కమ్యూనిటీ హాల్, మరో రూ.11లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. వర్షాలు ప్రారంభమైతే గ్రామ నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ తీసుకెళ్లడం కష్టమని, అప్పటిలోగా తాత్కాలిక రోడ్డు వేయించాలని గ్రామస్తులు ఆమెను కోరారు. స్పందించిన ఆమె ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తాత్కాలిక రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం అక్కడి నుంచి మామిడిగూడలోని సబ్ సెంటర్‌ను సందర్శించిన ఆమె మంగ్లీ గ్రామంలో వెంటనే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి చిన్నారులతో పాటు గర్భిణులకు వైద్య పరీక్షలు చేయాలని వైద్యులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఆమె వెంట ఏఈఈ సలావుద్దీన్, కాంట్రాక్టర్ ప్రకాష్ చౌహన్, సర్పంచ్, ఎంపీటీసీ ఉన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని నిరసన



ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలం జున్నపాని గ్రామంలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టెక్నికల్ డీఈకి వినతి పత్రాన్ని అందజేసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జున్నపాని గ్రామంలో గత పదేళ్ల క్రితం వ్యవసాయ భూముల్లో అధికారులు బోర్‌లు వేసినప్పటికీ ఇప్పటివరకు విద్యుత్ సౌకర్యం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డీడీలు చెల్లించినప్పటికీ అధికారుల కరెంటు సరఫరా చేయడం లేదని పేర్కొన్నారు. పలుసార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని వాపోయారు. వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుమ్రరాజు, జలపత్, లక్ష్మణ్, కన్నీరాం పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ హనుమంజి గుట్ట ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం... హామీర్ పునిస్సా గురువారం ఇంటికి తాళం వేసి శుభకార్యానికి వెళ్లింది. అర్ధరాత్రి ఇంట్లో నుంచి మంటలు రావడంతో స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి, స్థానిక కౌన్సిలర్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలార్పారు. పునిస్సా మనవరాలు పెండ్లి కోసం ఇంట్లోని సామాన్లు, కొత్త బట్టలు, రూ.50వేల నగదు ఉంచగా పూర్తిగా ఖాళీపోయాయి. దీంతో సుమారు రూ.3లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయింది. స్థానిక కౌన్సిలర్ మేడారం అపర్ణ– ప్రదీప్ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి వారికి సాయం అందిస్తామని హామీచ్చారు. తక్షణ సాయం కింద రూ.5 వేలు అందజేశారు. శుక్రవారం బాధితులను మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పరామర్శించారు.

రేషన్ డీలర్లకు ఉపాధి భద్రత కల్పించాలి

నిర్మల్‌చైన్‌గేట్: రేషన్ డీలర్లకు ఉపాధి భద్రత కల్పించాలని, గౌరవ వేతనం చెల్లించాలని రేషన్ డీలర్ల జేఏసీ రాష్ట్ర చైర్మన్ నాయకోటి రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజరాజేశ్వర గార్డెన్‌లో జరిగిన సమ్మె సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రేషన్ డీలర్ల సమస్యలను మొదటి నుంచి నిర్లక్ష్యం చేస్తుందని, తెలంగాణ ఉద్యమంలోనూ, కరోనా సమయంలోనూ రేషన్ డీలర్లు అందించిన సేవలు మరువలేనివన్నారు. రేషన్‌డీలర్లందరికీ ఉపాధి భద్రతతో పాటు హెల్త్ కార్డులు అందజేయాలన్నారు. ఇప్పటికే చాలాసార్లు ప్రభుత్వానికి తమ సమస్యలు విన్నవించామని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. జేఏసీ కన్వీనర్ మల్లికార్జున్ గౌడ్, జేఏసీ కన్వీనర్ రవీందర్, ఉపాధ్యక్షుడు రమేష్ ఉన్నారు.

నవోదయ పిలుస్తోంది..!



కాగజ్‌నగర్ కేంద్రీయ జవహర్ నవోదయ విద్యాలయం

- ఆరోతరగతిలో ప్రవేశానికి నేడు పరీక్ష
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్ష రాయనున్న 5,920 మంది విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తిగల సంస్థ, అక్షరాస్యత, పాఠశాల విద్యా విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న కేంద్రీయ జవహర్ నవోదయలో ప్రవేశానికి శనివారం నిర్వహించనున్న పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 2023–24కు విద్యాసంవత్సరానికి ఆరోతరగతిలో ప్రవేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 5,920 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఆరో తరగతిలో 80 సీట్ల భర్తీకి ఉమ్మడి జిల్లాను 14 బ్లాక్‌లుగా విభజించారు. ఆయా బ్లాక్‌లలో 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతీ కేంద్రంలో 130 మందికి పైగా, గరిష్టంగా 360 మంది పరీక్ష రాయనున్నారు. పరీక్ష ఉదయం 11.30నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు కొనసాగనుంది. విద్యార్థులు ఉదయం 11గంటలలోపే కేంద్రాలకు చేరుకోవాలి. 11.30 తర్వాత వచ్చేవారిని అనుమతించరు. విద్యార్థులు హాల్‌టికెట్, వాటర్ బాటిల్, ఆధార్‌కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలి. ఎలక్ట్రానిక్స్ పరికరాలు అనుమతించరు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతేడాది పరీక్ష రాసినవారు ఎనిమిది మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారికి ఈసారి అఫిడవిట్ అవకాశం కల్పించారు. ప్రిన్సిపాల్ ద్వారా అందించే అడ్మిట్ కార్డు ఆధారంగానే వారు పరీక్ష రాయాల్సి ఉంటుంది.

ఏర్పాట్లు పూర్తి చేశాం



శనివారం జరిగే నవోదయ ప్రవేశ పరీక్ష కోసం విద్యాలయ సమితి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉమ్మడి జిల్లాలోని ఎస్పీలకు బందోబస్తు కోసం దరఖాస్తు చేశాం. కలెక్టర్లకు ఫ్లయింగ్ స్క్వాడ్ కోసం నివేదించాం. పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్లు, పరిశీలకులను నియమించాం. ఆన్‌లైన్ ద్వారా నలుగురు విద్యార్థులు తప్పుగా దరఖాస్తు చేసినట్లు తెలిసింది. వీరు ఈ పరీక్ష రాసేందుకు అనర్హులు.

– టీ చక్రపాణి, ప్రిన్సిపాల్

రిజర్వేషన్లు ఇలా...

- కనీసం 75 శాతం సీట్లు జిల్లాలోని గ్రామీణ విద్యార్థులతో భర్తీ చేస్తారు.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగ విద్యార్థుల కోసం రిజర్వేషన్లు ఉన్నాయి.
- బాలికల కోసం కనీసం 1/3 వంతు సీట్లు కేటాయించబడ్డాయి.

విద్యాలయం ప్రత్యేకతలు

- జిల్లా విద్యాలయంలో సహవిద్య, ఆవాసీయ పాఠశాల
- బాలబాలికల కోసం ప్రత్యేకమైన హాస్టళ్లు
- ఉచిత విద్య, భోజన సదుపాయం
- మైగ్రేషన్ పథకం ద్వారా విస్తృతమైన సాంస్కృతిక వినిమయం
- స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వృద్ధి
- ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్ఎస్ఎస్
- నాణ్యమైన విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టడం ద్వారా ఉత్తమ ఫలితాల సాధన
- జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్ ఉన్నత పరీక్ష ఫలితాల్లో నవోదయ విద్యార్థులు ప్రతిభ కనబర్చిన విషయం తెలిసిందే.
- 10వ తరగతి, ఇంటర్ బోర్డు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం ఎదురుగా వస్తున్న బైక్‌ను మ్యాక్స్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. తాంసి గ్రామానికి చెందిన విజయ్ మరో వ్యక్తితో కలిసి ఆదిలాబాద్ వైపు వెళ్తున్నాడు. జిల్లా కేంద్రం నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న మ్యాక్స్ వాహనం ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇరువురు గాయపడ్డారు. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

భక్తులపై తేనెటీగల దాడి

తాంసి: భీంపూర్ మండలంలోని ధనోరా గ్రామ శివారులోని దర్గా వద్ద భక్తులపై శుక్రవారం తేనెటీగలు దాడిచేశాయి. దర్గా వద్దకు మొక్కులు చెల్లించుకోవడానికి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు వచ్చారు. భక్తులు వంటలు చేసుకునే క్రమంలో చెట్లపై ఉన్న తేనెటీగలు దాడిచేశాయి. దీంతో భక్తులు పరుగులు తీశారు.

ఎరువులు వచ్చేశాయి



రబీ సీజన్ ప్రారంభానికి మరో నెల రోజులే సమయముంది. అన్నదాతలు ఇప్పటికే రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. వారికి అవసరమైన యూరియా, డీఏపీ వంటి ఎరువులకు కొరత లేకుండా అధికారులు ముందే వాటిని తెప్పిస్తున్నారు. శుక్రవారం ఎరువులతో కూడిన ప్రత్యేక రైలు జిల్లాకు చేరుకుంది. ర్యాకుల్లో వచ్చిన ఎరువులను వ్యవసాయశాఖాధికారులు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు లారీల ద్వారా తరలించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

బాసరలో లక్ష దీపార్చన



భైంసాటౌన్: బాసరలో గోదావరి నదీ తీరం దీప కాంతుల్లో వెలిగిపోయింది. మహారాష్ట్ర పార్డికర్ ఆశ్రమానికి చెందిన భక్తులు బాసరలో వారం రోజులుగా సప్తాహం నిర్వహిస్తున్నారు. వైశాఖమాసం శుక్లపక్షం శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని సాయంత్రం లక్ష దీపార్చన కార్యక్రమం నిర్వహించారు. గోదావరికి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నవీపేట: నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలోని నాగేపూర్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లా బాసర గ్రామానికి చెందిన బోధన్‌కర్ పెద్ద గంగాధర్ (37)కు చెందిన హార్వెస్టర్ నాగేపూర్ శివారులో వరి కోతలు కోయడానికి వచ్చింది. హార్వెస్టర్‌పై పనిచేస్తున్న డ్రైవర్, క్లీనర్లకు బాసర నుంచి గంగాధర్ ఆహారం బైక్‌పై తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో నాగేపూర్ శివారులో అడ్డు వచ్చిన కుక్కను తప్పించగా బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తల్లి రుక్మాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.